# అనగనగా... ఒక కథ

# సుందరం పెళ్లి

సుందరం అర్జెంటుగా ఉద్యోగం సంపాదించాలి. సంపాదిస్తేనే సుబ్బలక్ష్మిని ఇచ్చి పెళ్లి చేయమని ధైర్యంగా మామయ్యనడగవచ్చు. మామయ్యకి సుందరం అంటే ఇష్టమే. సుబ్బలక్ష్మినిచ్చి తనకి పెళ్లి చేయడమంటేనూ ఇష్టమే. కానీ సుందరాన్ని ఇక్కడే ఉండి వ్యవసాయపు పనులు చూసుకోమని అంటున్నాడు. తనకి గనుక ఉద్యోగం వచ్చేస్తే ఈ మట్టి పనిని శాశ్వతంగా వదిలేసి హాయిగా పట్నంలో సుబ్బలక్ష్మితో కాపురం పెట్టేయొచ్చు. ఉద్యోగం వస్తే పెళ్లి చేయక చస్తాడా?

లక్కీగా ఆ రోజు ఓ కాల్ లెటర్ వచ్చింది. విజయవాడలో జయ హోటల్‌లో రేపే ఇంటర్వ్యూకి హాజరవ్వమనే శుభవార్త వచ్చింది. బావకి ఆ జాబ్ వస్తే కనకదుర్గమ్మకి పసుపుకుంకాలిస్తానని మొక్కుకుంది సుబ్బలక్ష్మి.

సుందరం మావయ్య గొల్లున నవ్వాడు. "ఆ జాబ్ సిండికేట్ వాళ్లు నీకెన్నిసార్లు కాల్ లెటర్ పంపలేదు. ఎన్ని ఇంటర్వ్యూలకి నువ్వు విజయవాడ, రాజమండ్రి, విశాఖపట్నం పరిగెత్తలేదు. చూస్తాన్... చూస్తాన్...చూస్తాన్... ఈ మాఘమాసం లోపుగా నువ్వు ఉద్యోగస్తుడివైనా కాకపోయినా పెళ్లి చేసి పడేసి అరక కానుకిస్తాను." అని మావయ్య సుందరంని వేళాకోళంగా బెదిరించాడు.

సుందరం మనసులో మామయ్య మీద కారాలు, మిరియాలు నూరుకున్నాడు. అయినా వెర్రి నవ్వు నవ్వాడు.

"వెర్రి నవ్వు నవ్వడం కాదు. మీరిద్దరూ ఏమనుకున్నా ఫాల్గుణమాసంలో మా ఇంట్లో పెళ్లి ఖాయం. మా సుబ్బులుకి బంగారం లాంటి పెళ్లికొడుకునిచ్చి పెళ్లి చేస్తాను" అని అన్నాడు.

ఆ మాటైతే అన్నాడు కానీ సుందరం బంగారం అని సుబ్బుల్ని బాగా చూసుకుంటాడని, వాళ్లిద్దర్నీ ఒక ఇంటి వాళ్లని చేస్తే తన జీవితం ప్రశాంతంగా వెళ్లిపోతుందని మావయ్యకు తెలుసు.

* * *

"యు ఆర్ సెలెక్టెడ్" సుందరాన్ని మెచ్చుకుంటూ శ్రీరాములుగారు చెప్పారు. "బట్ వన్ థింగ్... పోస్టింగ్ ఎక్కడ... నేచర్ ఆఫ్ జాబ్ ఏంటి... ఇలాంటి విషయాలు నీకనవసరం. నీకు రెండు వేలు జీతం కావాలన్నావ్. రెండున్నర వేలిస్తాను. ఫ్రీ ఎకామిడేషన్, ఫ్రీ మీల్స్, ఫ్రీ టిఫిన్స్ అండ్ ఫ్రీ కాఫీ కష్టపడి పనిచేస్తే ఇంకా ఎక్కువ ఫెసిలిటీస్ ఇస్తాను."

సుందరంకి ఇదంతా నమ్మశక్యంగా లేదు. థ్రిల్లయిపోతూ పదిసార్లు థాంక్స్ చెప్పాడు.

"ఏ పాటి సోమరితనం కనిపించినా వెంటనే డిస్మిస్ చేసి పంపిస్తాను. దట్సాల్."

"నేను రోజుకి ఇరవై గంటలు పనిచేస్తాన్ సార్" అన్నాడు సుందరం.

"అంతొద్దులే. ఆరు ఏడు గంటలు వళ్లొంచి పనిచేస్తే చాలు. ఎప్పుడు జాయిన్ అవుతావ్"

"ఈ మాఘమాసంలోనే సార్" అని తత్తరపడి "మీరెప్పుడంటే అప్పుడు సార్" అన్నాడు.

"గుడ్. నువ్వింటికెళ్లి రెండు రోజుల్లో ఇదే హోటల్. ఇదే రూమ్‌లో కలుసుకో. మన సైటుకి బయలుదేరుదాం. చూడు మిస్టర్ సుందరం చీటికీ మాటికీ సెలవులివ్వను. నీక్కావలసినవన్నీ తీసుకుని మొత్తం నీ లగేజీతో వచ్చేయ్."

"ఓ.కె. సార్...థాంక్యూ. బట్ వన్‌థింగ్ సార్ నెక్స్ట్ మంత్‌లో మ్యారేజ్ చేసుకుందామనుకుంటున్నాను."

"ఆ పెళ్లికి నేనూ వస్తాన్లేవయ్యా...అప్పుడు నేను సెలవు పెడతాన్లే" అని శ్రీరాములుగారు స్నేహంగా నవ్వుతూ అన్నారు.

* * *

బావకి ఉద్యోగం వచ్చిందన్న శుభవార్త విని సుబ్బలక్ష్మి ఎగిరి గంతేసింది. మావయ్య గుండెల్లో...పాపం రాయి పడింది. అయినా గంభీరం నటిస్తూ

"ఏం ఉద్యోగమో ఏమిటో.. అలా ఊరూ పేరూ లేనివాళ్లు స్మగ్లింగ్ వ్యాపారాలు చేయడానికో ఇంకా వేరే ఏమైనా వెధవ పనులు చేయించడానికే ఇలాంటి కుర్రకారుని వాడుకుంటారు. నీకు ఉద్యోగం చేయాలన్న పంతమే తప్ప ముందు వెనుకా ఆలోచనే లేదు."

"మావయ్యా, ఉడికిపోకు. ముందు నువ్వు పెళ్లి పనుల్లో పడు. ఫాల్గుణమాసంలోగా పెళ్లి చేయకపోతే సుబ్బలక్ష్మిని తీసుకెళ్లిపోయి కనకదుర్గమ్మ కోవెలలో పెళ్లాడేస్తాను" అని మావయ్య వైపు చూసి చల్లగా నవ్వేశాడు సుందరం.

"ఇందా ఈ దబ్బుంచు" అని ఓ వెయ్యి రూపాయలు మావయ్య సుందరం చేతిలో పెట్టాడు.

సుందరానికి కన్నీళ్లు తిరిగాయి. వద్దంటే బాధ పడతాడని తీసుకున్నాడు. ఓ పది ఇన్‌లాండ్ లెటర్లు తీసుకుని వచ్చి ఇచ్చి "నాలుగు రోజులకో ఉత్తరం రాయి. లేకపోతే ఆ వెర్రిది బెంగెట్టుకుంటుంది" అన్నాడు మావయ్య.

సుబ్బలక్ష్మికి మాట పెగలడం లేదు. గుండె, గొంతు రెండూ బరువుగా ఉన్నాయ్. కన్నీళ్లను కంట్రోల్ చేసుకుంటోంది. సుందరం మావయ్య కాళ్లకు దణ్ణం పెట్టి సుబ్బులుకి కన్నుకొట్టి బైచెప్పి బయలుదేరాడు.

* * *

విజయవాడ నుండి ప్రైవేటు టాక్సీలో బయలుదేరిన శ్రీరాములుగారు సుందరం అంబాజీపేట చేరుకున్నారు. ఆరేడు గంటలు ప్రయాణం చేస్తుంటే మధ్యలో చాలాసార్లు తన డ్యూటీ ఏంటో, తను చేసే జాబ్ ఎలాటిదో అడగాలని ప్రయత్నం చేశాడు.

శ్రీరాములుగారు-"నీకు నేనిచ్చే పని జీతం నచ్చకపోతే వెళ్లిపోదువుగానీ లేవయ్యా. నువ్వెన్ని రోజులు పని చేశావో అన్ని రోజులకి లెక్కకట్టి జీతం ఇస్తాను. పట్టుకుపోదువుగానీ"

**"ఇంగ్లీషు మాట్లాడితే వ్యవసాయం చేయకూడదా? వ్యవసాయం చేసుకునే వాడికి ఇంగ్లీషు రాకూడదా చూడు మిస్టర్...సుందరం నేను నీకిచ్చిన జాబ్ ఇదే. నువ్వు ఏ పని చెప్తే ఆ పని చేస్తానన్నావ్. నీకు నచ్చకపోతే నాకు నువ్వు నచ్చకపోతే వెళ్లిపోవలసింది నువ్వే. నువ్వు రెండు వేలడిగావ్. నేను రెండువేల అయిదొందలిస్తానన్నారు. ఎగిరి గంతేసొచ్చావ్. ఇప్పుడు మొహం వేలాడేస్తావేం".**

అన్నాడే తప్ప సుందరానికి కావల్సిన జవాబు చెప్పలేదు.

దేశాభ్యుదయానికి యువకులు, వారి పాత్ర, దేశ సౌభాగ్యానికి రైతులు వారు పడే శ్రమ గురించి మధ్యమధ్యలో సుదీర్ఘోపన్యాసం కూడా చేశారు అంతే తప్ప తన సంగతి తేల్చలేదు.

కొంచెం నస మాస్టరే అనుకున్నాడు సుందరం మనసులో. అంబాజీపేటలో శ్రీరాముల గారిది విశాలమైన కాంపౌండులో రెండంతస్తుల మేడ. మేడంటే మేడ కాదు రెండంతస్తుల పెంకుటిల్లు. చుట్టూ కొబ్బరి చెట్లు, బావి మోటారు పట్నం సుఖాలన్నీ అమర్చుకున్న పల్లె టూరి ఇల్లులా ఉంది. ప్రతీ రూంకి ఎ.సి. అమర్చినంత చల్లగా ఉంది. శ్రీరాములుగారు భార్యకి సుందరాన్ని పరిచయం చేసి "ఈ కుర్రాడు మనతోనే ఉంటాడు మేడ మీది పెద్దాది గది ఇతనికి ఏర్పాటు చేయించు" అని చెప్పారు. నౌకర్లు, చాకర్లు చాలామందే కనిపిస్తున్నా రుగానీ యజమానులు వీళ్లిద్దరే అని అర్థమయ్యింది సుందరానికి.

సుందరం మేడ మీదకి వెళ్లాడు. ఎటాచ్డ్ బాత్రూమ్, గీజరు హోటల్ రూమంతా నీటిగా వేసిన డబుల్ కాట్ బెడ్. స్నానం చేసి వచ్చేటప్పటికే భోజనానికి రమ్మని పిలుపొచ్చింది. సుందరం కిందకి వెళ్లాడు.

ఇక్కడ కూడా తనింట్లోలాగే అచ్చమైన తెలుగువంటలు శ్రీరాములు గారు, సుందరం భోజనం చేస్తుంటే శ్రీరాములుగారి భార్య కొసరి కొసరి వడ్డించి తినిపించింది.

ఒంటి నిండా నగలు, రూపాయి కాసంత బొట్టు అందంగా ముందు వైపు నెరసిన జుట్టు అచ్చం పార్వతమ్మలా ఉంది. తనకీ అమ్మా, అత్తా ఉంటే ఇలాగే ఉండే వాళ్లేమో అనుకున్నాడు సుందరం.

"కాసేపు పడుకోవయ్యా సాయంత్రం నాలుగు తర్వాత సైటుకె ళదాం" అని ఆవలిస్తూ బెడ్రూంలోకి వెళ్లిపోయాడు శ్రీరాములు గారు.

సుందరంకి మెళకువ వచ్చేసరికి అయిదుంపావయిపోయింది. కెవ్వుమని నాలిక్కరుచుకున్నాడు. మొదటిరోజే ఇలా జరిగిందేంటి అని అనుకునేంతలో ఇంట్లో పనివాడు కాఫీ తీసుకుని పైకొచ్చాడు.

"అయ్యగారు మిమ్మల్ని సైటు దగ్గరకి తీసుకురమ్మన్నారు. మీరు రెడీ అయ్యి కిందకు రండి" అని వెళ్లిపోయాడు.

గబగబా ఊదుకుంటూ కాఫీ తాగేసి, టపటపా రెడీ అయ్యి ధనధనా కిందకొచ్చాడు. బయట స్కూటర్ తుడుస్తున్నాడు ఇందాక కాఫీ తెచ్చిన కుర్రాడు. సుందరంతో "మీరు డ్రైవ్ చేస్తారా నన్ను చెయ్యమంటారా"

"నువ్ రూటు చెప్పు" అంటూ బండి స్టార్ట్ చేశాడు.

పది పదిహేనెకరాల కొబ్బరితోట. మధ్యలోంచి వేసుకున్న ప్రైవేటు రోడ్డు లాంటి ఖాళీ స్థలంలోంచి దూసుకెళ్లిన బండిని ఓ చెట్టు కింద ఆపు చేయించాడు. అక్కడో పెద్దాయన నూలు బనియను కట్టుకుని పంచ ఎగగట్టి కొబ్బరికాయలు తీస్తున్నాడు. నెత్తిమీద తలపాగా. సుందరం రాగానే గునపంతో కొబ్బరికాయలు వలుస్తున్న ఆ పెద్దాయన పనాపి "ఏం సుందరం బాగా నిద్రపట్టిందా" అన్నాడు. గొంతెక్కడో విన్నట్టుందే అనుకుంటున్న సుందరా నికి తలపాగా తీస్తూ నవ్వుతున్న శ్రీరాములుగారు కనిపించారు. సుందరం ఆశ్చర్యపోయాడు. "సార్! మీరిక్కడ ఈ వేషంలో... అ...ఆ...అంటే మీకు ఈ కల్టివేషన్ హాబీనా."

"హాబీ కాదు ప్రొఫెషన్...వృత్తి. మా తాతగారు, మా నాన్నగారు చేసిన కులవృత్తి."

"అంటే మీకు వేరే ఇండస్ట్రీలు అవి..."

"ఇది ఇండస్ట్రీ కాదా? వాట్ ఈజ్ ద లిటరల్ మీనింగ్ ఆఫ్ ఇండస్ట్రీ...వ్యవసాయ రంగం కూడా ఇండస్ట్రీయే కదా!"

"మరి నాకేదో ఉద్యోగం అని.. ఇంగ్లీషులో మాట్లాడి, ఇంటర్వ్యూలు చేసి."


"ఇంగ్లీషు మాట్లాడితే వ్యవసాయం చేయకూడదా? వ్యవసాయం చేసుకునే వాడికి ఇంగ్లీషు రాకూడదా చూడు మిస్టర్...సుందరం నేను నీకిచ్చిన జాబ్ ఇదే. నువ్వు ఏ పని చెప్తే ఆ పని చేస్తానన్నావ్. నీకు నచ్చకపోతే నాకు నువ్వు నచ్చకపోతే వెళ్లిపోవలసింది నువ్వే. నువ్వు రెండు వేలడిగావ్. నేను రెండువేల అయిదొందలిస్తానన్నారు. ఎగిరి గంతేసొచ్చావ్. ఇప్పుడు మొహం వేలాడేస్తావేం".

"నా చేత మట్టిపని చేయిస్తారా"

"నీకా అదృష్టం ఉంటే అదీ చేయిస్తా ఇప్పుడు నువ్వు చేయవలసిందల్లా కొబ్బరికాయలు దింపించడం, లారీల్లో ఎక్కించడం, లెక్కలు రాసుకోవడం, వసూలు చేయించడం ఎప్పుడు ఏ ఎరువులు వేయించాలో ఎప్పుడు మందులు కొట్టించాలో చూసుకోవడం అన్నీ ఇంగ్లీషు పనులే. ఒక్క నెల చూడు. నచ్చకపోతే వెళ్లిపో"

సుందరం ఇదా నా ఉద్యోగం అనే డిసప్పాయింటెడ్ మూడ్లో ఉన్నాడు.

"నాకిద్దరు కొడుకులయ్యా, ఇద్దర్నీ ఈ పనిలో పెట్టినా నీకిచ్చే జీతం కన్నా ఎక్కువ సంపాదించుకునే వాళ్లు. కానీ వాళ్లకి పట్నం మోజు. ఇంగ్లీషు ఉద్యోగాల మోజు. ఈ మట్టి పని చేయమని వెయ్యి, పన్నెండొం దల రూపాయలకి పట్నాల్లో ఉద్యోగాలు వెలగపెడుతు న్నారు. అది వాళ్ల ప్రాప్తం. నాక్కావల సింది నీలాంటి కుర్రకారం.



అందుకోసం వాళ్లు సంపాదించే దానికన్నా ఎక్కువ జీతమిచ్చి నిన్నిక్కడ పనిలో పెట్టుకున్నాను"

సుందరంకి శ్రీరాము లగారి మాటల్లో నిజాయితీ కని పించింది. ఏదో రియలైజేషన్ కలిగి నట్టయింది. అక్కడే ఉండి ప్రతీ చెట్టుని సొంత కొడుకులా ఆదరిస్తున్న శ్రీరాములుగారి కొబ్బరి తోటలో తనో చెట్టులా పెరగాలని నిర్ణయించుకున్నాడు.

కొన్ని నెలలు గడిచాయి శ్రీరాములుగారు. సుందరానికి ఇంక్రిమెంట్ ఆఫర్ చేశారు. అతని కమిట్మెంట్ని, టైమింగ్ని మెచ్చుకుంటూ. కానీ సుందరం జాబ్ రిజైన్ చేస్తానన్నాడు. శ్రీరాములుగారు ఏం అంటూ గద్దించారు.

"క్షమించండి సార్. మా మావయ్య కూడా పదెకరాల ఆసామి. వసాయపు పనులు చేస్తూ ఇంటిపట్టున ఉండరా నా కూతుర్నిచ్చి పెళ్లిచేస్తానంటే, ఈ మట్టిపని నాకొద్దని ఉద్యోగం వెల గబడతానని ఇక్కడికొచ్చాను. ఈ మట్టిపనిలో నాకు తృప్తి కనిపించింది. ఇంటికెళ్లిపోతాను. మావయ్యకి అండగా నిలవడం నా బాధ్యత అనిపిస్తోంది."

"వెరీగుడ్...గోహెడ్, నువ్వు ఇంకో ఉద్యోగానికి కాకుండా వ్యవసాయ రంగానికే వెళ్తు న్నావంటే నాకు చాలా సంతోషంగా ఉంది. నాకు ఇంకో సుందరం దొరుకుతాడు. కానీ నీకు ఇంకో సుబ్బలక్ష్మి దొరకదు. తప్పకుండా వెళ్లు. నీ పెళ్లికి మమ్మల్ని పిలువు."

సుందరం, శ్రీరాములుగారి కాళ్లకు దణ్ణం పెట్టాడు. ఇంకో కొడుకుని దూరం పంపిస్తు న్నంత బాధ పడినా, మంచిపని చేద్దామని నిర్ణయించుకున్నందుకు సాదరంగా సాగనంపారు శ్రీరాములుగారు. *